నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
శుక్రవారం 10 మార్చి 2023

అంధత్వ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-రెంజల్

అంధత్వ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని, అందువల్లనే సీఎం కేసీఆర్ ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని సర్పంచ్ పాముల సాయిలు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని బాగేపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు అంధత్వాన్ని తొలగించేందుకు ఈ బృహత్తర ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ అవకాశాన్ని 18 సంవత్సరాల పైబడిన నిరుపేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుదర్శన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వినయ్ కుమార్, హెచ్‌ఓలు కరిపే రవీందర్, శ్రావణ్ కుమార్, పీహెచ్ఎస్ రాణి, కంటి వైద్య నిపుణులు ప్రవీణ్, ఇర్ఫాన్, ఆరోగ్య కార్యకర్త భాగ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వరి తెగులు నివారణపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఎక్కపల్లి, పర్మల్ల తండాలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్‌కుమార్ గ్రామపంచాయతీలో వరి పంటను క్షేత్రస్థాయిలో సందర్శించి వరి పంటపై ఆశించే తెగుళ్ల యాజమాన్యం గురించి రైతులకు గురువారం వివరించారు. ఇందులో ముఖ్యంగా రైతులకు వరిలో అగ్గి తెగులు నివారణపై వివరించారు. అగ్గి తెగులును గమనించిన వెంటనే ఎకరాకు 15 కిలోల పొటాషియంను ఇసుకలో కలిపి పంటకు చల్లడం ద్వారా పంటకు రోగ నిరోధక శక్తి పెరిగి అగ్గి తెగులును తట్టుకునే శక్తి పంటకు వస్తుందని తెలిపారు. నివారణ కోసం ట్రై సైక్లోజోల్ 120 గ్రాములు ఎకరాకు లేదా ఐసో ప్రోతలిన్ 300 మిల్లీ లీటర్లు ఎకరాకు లేదా కాసుగమైసిన్ 500 మిల్లీలీటర్లు ఎకరాకు రెండు వందల లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఆయన సూచించారు. ఆయన వెంట రైతులు పోచయ్య కాశిరం, రవి, ప్రకాష్, వీఆర్ఏ నాగరాజు తదితరులున్నారు.

ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి

- వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలి
- పెద్దకొడప్‌గల్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- కల్యాణిలక్ష్మి చెక్కులు పంపిణీ..
- మహిళా ఉద్యోగులకూ సన్మానం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలో యాసంగిలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగయ్యాయో ఎమ్మెల్యే షిండే మండల వ్యవసాయాధికారిని అడుగగా.. ఫోన్‌లో చూసి పంటల సాగు విస్తీర్ణం చెప్పడం చేత ఆయనపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నామని డీఈ కౌశిక్ తెలిపారు. శివపూర్ తలాప్తాండ, పోచారం, పోచారం తాండ గ్రామాల ప్రజలు ఆసుపత్రికి వెళ్లాలంటే జుక్కల్ వెళ్ళవలసి వస్తుందని సర్పంచులు మదన్, గణపతి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా గ్రామ సర్పంచులు వేసవికాలం వస్తుండడంతో గ్రామాలలో నీటి సమస్య ఏర్పడుతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బోర్లు వేసి ప్రజలకు వేసవి కాలంలో నీటి తిప్పలు రాకుండా చేస్తామని సర్పంచులకు హామీ ఇచ్చాడు. చిన్నతకడపల్లి, తుగ్దాల్, జగనాథ్‌పల్లి గ్రామాలలో విద్యుత్ బిచ్కుంద మండలం నుంచి ఉండడం చేత ఎల్సీ తీసుకోవడం ఇబ్బందిగా ఉందని సర్పంచ్ కోరగా మండలానికి వచ్చే విధంగా చూడాలని ఎమ్మెల్యే విద్యుత్ వైద్య అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ తిరుమలరెడ్డి, ఎంపీడీవో రాణి, ఎమ్మార్వో దశరథ్, ఎంపీఓ సురేకాంత్, సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, కో ఆప్షన్‌మెంబర్ జాఫర్ షాప్, సంబంధిత శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే


మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ..

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జుక్కల్ శాసనసభ్యులు హన్మంత్ షిండే చేతుల మీదుగా లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరవాత ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసి ఆదుకుంటున్నారని ఆయన అన్నారు. ఇందులో భాగంగానే పేద కుటుంబంలో పుట్టిన ఆడబిడ్డలు కుటుంబానికి బరువు కాకూడదనే ఉద్దేశ్యంతోనే ఆడపిల్లల పెళ్లి కోసం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా సాయం అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ తిర్మల్‌రెడ్డి, ఎంపీడీవో రాణి, తహసీల్దార్ దశరథ్, ఎంపీఓ సురేకాంత్, సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ జాఫర్ షాప్, ఉప సర్పంచ్ విఠల్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సన్మానించిన ఎమ్మెల్యే..

మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో మహిళా ఉద్యోగులను అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే షిండే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షులు తిరుమల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, కో ఆప్షన్ నెంబర్ జాఫర్ష తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వాహన ఇన్సూరెన్స్ చేసుకోవాలి

- మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

వాహనదారులు సకాలంలో వాహన ఇన్సూరెన్స్ చేసుకోవాలని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు కామారెడ్డి జిల్లాల్లో ఆర్టీఓ డాక్టర్ వాణి అదేశాల మేరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో వాహనాలు ఇన్సూరెన్స్ చేసుకోవాలని, ఫిట్‌నెస్, నెంబర్‌ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఈ తనిఖీలలో భాగంగా ఒక ట్రాక్టర్, వ్యాన్‌ను పట్టుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి వాహనమైనా సరైన ధ్రువపత్రాలు లేనిచో జరిమానా 200శాతం విధించబడుతుందని, కావున వెంటనే ఆలస్యం చేయకుండా తమ వాహనాల పన్నులను ఆన్లైన్ విధానం ద్వారా చెల్లిస్తే అపరాధ రుసుము చాలా తక్కువగా ఉంటుందని తెలిపారు. వాహనాల వెంబడి సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ భాస్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

13న మధ్యాహ్న భోజనం బంద్

- మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ధర్నాకు తరలిరావాలి
- జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి

నవతెలంగాణ-రెంజల్


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13న మధ్యాహ్న భోజనం బంద్ చేస్తున్నట్టు జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి తెలిపారు. దీనికి సహకరించాలని వారు కోరారు. గురువారం మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ఈ నెల13న రాష్ట్రవ్యాప్తంగా ఒక్కరోజు బందుకు సహకరించాలని వారు వినతి పత్రంలో కోరారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల బకాయిలను చెల్లించాలని, గుడ్డుకు అదనంగా గత మూడు నెలల కాలంలో విద్యార్థులకు అందించిన డబ్బులను అందజేయాలని, సీఎం కేసీఆర్ ప్రకటించిన విధంగా రూ.మూడు వేల గౌరవ వేతనం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మిక సంఘం నాయకులు సుమేద, శోభ, ఆషోభి, మంజుల, సాయి అన్న తదితరులు పాల్గొన్నారు.

అధిక యూరియా వాడకంతో వరిలో అగ్గితెగులు

- మండల వ్యవసాయాధికారి నరేష్

నవతెలంగాణ-గాంధారి

అధిక యూరియా వాడకంతో వరిలో అగ్గితెగులు వ్యాపిస్తుందని మండల వ్యవసాయాధికారి నరేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గుర్జాల్ గ్రామ పరిధిలోని వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ప్రస్తుతం అగ్గితెగులు, కాండం తొలుచు పురుగు గమనించినట్టు తెలిపారు. రైతులు ఎక్కువ మొత్తంలో యూరియా వాడడం వలన తెగులు ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉందని, కావున రైతులు తగిన మోతాదులో యూరియా వాడుతూ వ్యవసాయ అధికారుల సూచనలు పాటించటం ద్వారా పెట్టుబడి తగ్గించుకొని, తక్కువ పెట్టుబడితో చీడపీడలు, తెగుళ్లను నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతులు జోవర్ సింగ్, ప్రకాష్, భిచ్చన్, ఏఈఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు జిల్లా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సర్వసభ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు ముఖ్యకార్యనిర్వాహక అధికారి సాయన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డిలో గురువారం కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు కంటి వెలుగు శిబిరానికి వచ్చే విధంగా ఆరోగ్య ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తారని చెప్పారు. కంటి వెలుగు కేంద్రంలో ఉన్న సౌకర్యాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ సత్య బాయి, నేత్ర వైద్య నిపుణుడు లింబాద్రి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షల పకడ్బందీగా నిర్వహించాలి..

కామారెడ్డి జిల్లాలో పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డిలోని సందీపని కళాశాలలో గురువారం పదో తరగతి పరీక్షలు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 11,899 మంది విద్యార్థులు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తారని చెప్పారు. 595 ఇన్విజిలేటర్లను నియమించామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, పరీక్షల విభాగం అధికారి నీలి లింగం, అధికారులు పాల్గొన్నారు.


కంటి వెలుగు శిబిరాన్ని సందర్శిస్తున్న కలెక్టర్

13న కేటీఆర్ రాక

- సభాస్థలిని పరిశీలించిన జిల్లా ఎస్పీ


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-పిట్లం

రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఈ నెల 13న పిట్లం, నిజాంసాగర్ మండలాలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు రానున్న సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా బహిరంగ సభాస్థలిని జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని కుర్తి గ్రామ హైలెవెల్ బ్రిడ్జి, నిజాంసాగర్ మండలంలోని జక్కాపూర్ గ్రామ శివారులో రూ.470 కోట్లతో నిర్మిస్తున్న నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులతో పాటు, నిజాంసాగర్ మంజీరాపై నిర్మించిన హైలెవెల్ బ్రిడ్జి రాకపోకలను ప్రారంభించనున్నారు. పనులను పరిశీలించిన వారిలో బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, ఎస్ఐ విజయ్ కొండ, సీనియర్ నాయకులు అన్నారం రెడ్డి, సి.ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక
- ఘనంగా మహిళా దినోత్సవం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

భారతీయ సంస్కృతిలో మహిళలకు ఎంతో గొప్ప స్థానం ఉందని ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి హారిక అన్నారు. గురువారం ఎల్లారెడ్డి ప్రభుత్వం మోడల్ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్లారెడ్డి మున్సిఫ్ న్యాయమూర్తి హారిక హాజరై విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో కదిలితే మహిళలు పురుషులు అనే తేడా లేకుండా మనం ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతామన్నారు. మహిళలు సాధికారత స్వేచ్ఛగా జీవించడానికి సమాజంలో మహిళల పాత్ర పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సమాజంలో మహిళలపై జరుగుతున్న హత్యాచారాలపై వాటి సెక్షన్లు వివరిస్తూ సమాజంలో మహిళలు ధైర్యంగా ఉండాలన్నారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో ఒకరిని ఆదర్శంగా తీసుకొని తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలను గౌరవించడం మన అందరి బాధ్యత అన్నారు. విద్యార్థుల ప్రమాణాలు పెంచడం ద్వారానే అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవాలని చాకలి ఐలమ్మ సావిత్రిబాయి పూలే గుర్తు చేశారు. అనంతరం పాఠశాల నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాల్లో చక్కటి ప్రదర్శన పరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళ అధ్యాపకురాలు రాణి, నాగనిక, గోదావరి, సిద్ధ లక్ష్మి, సంగీత, వసంత లక్ష్మి, అధ్యాపకులు ప్రభాకర్ రావు, గంగారెడ్డి, సిద్ధిరాజ్, కృష్ణ ప్రసాద్, వినయ్, శశిధర్, చంద్రకాంత్, కిరణ్ కుమార్, అలీ, రాజు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న న్యాయమూర్తి

బాల్యవివాహాలను అరికట్టాలి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి
- అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి

నవతెలంగాణ-రెంజల్

బాల్యవివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి అన్నారు. గురువారం మండలంలోని బాగేపల్లి గ్రామంలో అంగన్వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి సందర్శించి పిల్లలకు పౌష్టికాహారాన్ని పరిశీలించారు. మహిళలకు ఆడపిల్లలు మగ పిల్లల తేడాల గురించి వివరించడంతోపాటు, బాల్యవివాహాలను అరికట్టాలని మహిళలకు సూచించారు. టోల్ ఫ్రీ గురించి మహిళలకు అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్‌కు ఫ్రీ స్కూలు వివరాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, టెలిఫోన్ ఇచ్చిన యాప్‌లను ఎప్పటికప్పుడు పూర్తి చేసే రికార్డులు పొందుపరచాలని ఆమె సూచించారు. ఆమె వెంట అంగన్వాడీ టీచర్ సరోజ, సీఏ గంగామణి, గ్రూప్‌సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే విద్యార్థుల భవిష్యత్

- జిల్లా విద్యాశాఖ అధికారి రాజు
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రతిభాపరీక్ష విజేతలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

చదువుతోనే విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అన్నారు. గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన పదవ తరగతి ప్రతిభ పరీక్ష విజేతలకు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించడం కోసం ఎస్ఎఫ్ఐ చేసిన ప్రయత్నం చాలా గొప్పదని, ఇలాంటి ప్రతిభా పరీక్షలు విద్యార్థులకు చాలా ఉపయోగపడుతాయని అన్నారు. విద్యార్థులు పరీక్షల మీద ఉన్న భయాన్ని పోగొట్టుకొని చదవాలని అన్నారు. చదువుతోనే విద్యార్థుల భవిష్యత్తు మారుతుందని, కావున విద్యార్థులు చెడు మార్గాలకు పోకుండా చదివి ఉన్నత మార్గాలకు చేరుకోవాలని అన్నారు. ప్రతిభా పరీక్షలలో విజేతలుగా నిలిచిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఎగ్జామినేషన్ ఇంచార్జ్ నీలం లింగం, సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరుణ్, ఉపాధ్యక్షులు అల్తాఫ్, గర్ల్స్ కన్వీనర్ వర్షిని, నాయకులు అవినాష్, అనిల్ పాల్గొన్నారు.


బహుమతులతో ప్రతిభ చూపిన విద్యార్థులు

మున్సిపాలిటీలో తైబజార్ వేలం

నవతెలంగాణ-బోధన్

బోధన్ మున్సిపల్ కార్యాలయంలో తైబజార్ నిర్వహణకు కమిషనర్ ఖమర్ ఆహ్మద్ వేలం పాట నిర్వహించారు. గత సంవత్సరం రూ.20,51,000లు పలికిన తైబజార్ వేలం, 2024 సంవత్సరానికి గానూ రూ.21,2000 అజర్ ఆహ్మద్ అనే వ్యక్తి వేలంలో తైబజార్ దక్కించుకున్నారు. అలాగే పశువధ శాల గత సంవత్సరం రూ.27000లు పలకగా, ఈ సంవత్సరానికి గాను 7,90,000 కు ఆహ్మద్ ఖురేషి వేలంలో పశువధశాల నిర్వహణ దక్కించుకున్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ గ్రామంలోగల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా రుణ గ్రహీతలకు కుట్టు మిషన్లను గురువారం విరాళంగా అందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ మహిళా కేంద్రీకృత సిఎస్ఆర్ కార్యకలాపాలు, చొరవ కోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజియన్ మహిళా రుణగ్రహీతలకు కుట్టు యంత్రాలను విరాళంగా అందించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ అధికారి నరేందర్ కుమార్, నూత్ పల్లి, బాల్కొండ, కమ్మర్పల్లి, ఆర్మూర్ తదితర శాఖల మేనేజర్లు పాల్గొనడం జరిగింది.

నల్లగుట్ట తండాలో వాలీబాల్ టోర్నమెంట్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని నల్లగుట్ట తండా గ్రామపంచాయతీలో ఈనెల 19న వాలీబల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు ప్రతాప్, చిన్న తెలిపారు. ఎంట్రీ ఫీజు 600 రూపాయలు ఉంటుందని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 17న ముగుస్తుందని పేర్కొన్నారు. మొదటి ప్రైజ్ ఎనిమిది వేల రూపాయలు, రెండవ ప్రైజు 5000 రూపాయలు మూడవ ప్రైస్ 3000 రూపాయలు అందజేస్తామని తెలిపారు. ఈ టోర్నమెంట్ కు రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, జిల్లా ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యుడు జగన్, జడ్పిటిసి తనుజ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ కుంచాల విమల రాజు, మాజీ ఎంపీపీ అనంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మోహన్ నాయక్, హాజరవుతారని పేర్కొన్నారు. వివరాలకు 8500062348, 9908717163 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఆటలతో మానసిక ఉత్తేజం

- నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్
- మహిళలకు ఆటల పోటీలు, సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్/కమ్మర్‌పల్లి/ఆర్మూర్

ఆటలు మానసిక ఉత్తేజాన్ని ఇస్తాయని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం చాలా హర్షించదగ్గ పరిణామం అని అన్నారు. అందులో భాగంగా గురువారం నగరంలోని 6వ డివిజన్‌లో గల మహిళ కామ్యూనిటీ హాల్ వద్ద మహిళలకు ఆటల పోటీలను నగర మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ ప్రారంభించారు. ఆటల ద్వారా పోటీతత్వం పెరిగి ఉత్తమ ప్రతిభ కనబర్చటానికి దోహదం చేస్తాయని అన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం మహిళ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని మహిళలకు, మహిళ ఉద్యోగులకు అధిక ప్రాధానం ఇస్తూ అన్ని రంగాల్లో రాణించాలని ప్రోతహిస్తుందని తెలిపారు. అవకాశాలను అందిపుచ్చుకుని విజయానికి బాటలు వేసుకోవాలని సూచించారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని హసకొత్తూరు గ్రామంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సర్పంచ్ ఏనుగు పద్మా రాజేశ్వర్, పాలకవర్గం సభ్యులు ఘనంగా సన్మానించారు. గ్రామంలోని అంగన్వాడి టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎం, మహిళా సంఘాల వివోలు, సీఏలు, గ్రామపంచాయతీ మహిళ వార్డు సభ్యులను, పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ మాట్లాడుతూ ఇంటిని, కుటుంబాన్ని చక్కదిద్దడమే కాకుండా ఎంచుకున్నటువంటి వృత్తిలో న్యాయం చేస్తున్నారన్నారు. పదిమందికి ఉపయోగపడేలా పనులు చేస్తూ ఈ సమాజాన్ని, ఈ వ్యవస్థను ముందుకు నడుపుతున్నది మహిళలని అన్నారు. అంగన్వాడి ఆయాలకు, పంచాయతీ మహిళ పారిశుద్ధ కార్మికులకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పంపించిన చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్ రెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు వసంత్ నాయక్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు మండపల్లి మాధురి, కుందేటి పుష్ప, ఏఎన్ఎం మమత, మహిళా సంఘాల లీడర్లు, సిఏలు,పాల్గొన్నారు.


కంఠేశ్వర్ : ఆటలను ప్రారంభించిన మేయర్

ఆర్మూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని పద్మశాలి సంక్షేమ సేవాసమితి ఆధ్వర్యంలో హౌజింగ్ బోర్డులో నిర్వహించారు. వివిధ రంగాలలో విశిష్ట సేవాలందించిన పట్టణంలోని పద్మశాలి మహిళలను పద్మశాలి సంక్షేమ సేవ సమితి అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్, ప్రధాన కార్యదర్శి కొక్కుల రమాకాంత్ సన్మానించారు. ఈ సందర్భంగా మ్యాక మోహన్ దాస్ మాట్లాడుతూ మహిళలవల్లే సమాజం బాగుపడుతుందని అన్నారు. కొక్కుల రమాకాంత్ మాట్లాడుతూ 30మంది పద్మశాలీ మహిళలను సన్మానించి ప్రశంశా పత్రాలు అందజేశామని అన్నారు. ప్రోగ్రాం చైర్మన్ గా కట్కమ్ నరేందర్, వేముల ప్రకాష్, అందే నాగేశ్వర్, మ్యాక విష్ణు దాస్, పొలాస రాములు ప్రధానోపాధ్యాయులు చేతన కుమారి, హేమ లత, వసంత ,తర్ప అధ్యక్షులు పాల్గొన్నారు.


ఆర్మూర్: మహిళలను సన్మానించిన పద్మశాలీ సంఘం సభ్యులు


కమ్మర్‌పల్లిలో..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ట్రీ కటింగ్స్, ఇన్సులేటర్స్ రీప్లేస్మెంట్, జంపర్స్ రీప్లేస్మెంట్ లో భాగంగా శుక్రవారం నిజామాబాద్ టౌన్ 2, 3 సబ్ డివిజన్ పరిధిలో ఉదయం 7.30 నిమిషాల నుండి 10 గంటల 30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడిఈ 2,3 తోట రాజశేఖర్, పి.విరేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డి2 సెక్షన్ పరిధిలో ఓల్డ్ ఫారెస్ట్ ఆఫీస్ వెనుక భాగం, బాపూజీ వచనాలయం, దేవి రోడ్డు చౌరస్తా, జవహర్ రోడ్, గాంధీ చౌక్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్, ధర్మకాంట, నెహ్రూ పార్క్, హెడ్ పోస్ట్ ఆఫీస్, కసబ్ గల్లీలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. డి-3 సెక్షన్ పరిధిలో న్యూ ఎన్జీవో కాలనీ, సిండికేట్ బ్యాంక్ కాలని, రైతు బజార్ ఏరియా, గౌతమ్ నగర్, జన్మ భూమి రోడ్డు, డి9, డి5 సెక్షన్ పరిధిలో చంద్రశేఖర్ కాలనీ, నీలకంఠేశ్వర టెంపుల్, ఉమెన్స్ కాలేజ్, విద్యుత్ నగర్, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్, డి4 సెక్షన్ పరిధిలో శ్రీనగర్ కాలనీ, వినాయక నగర్, 100 ఫీట్ రోడ్, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీ, శిరిడి సాయి నగర్, షిరిడి సాయి, కృప నగర్, గూడెం, భవాని నగర్, డి7 సెక్షన్ పరిధిలో బ్యాంక్ కాలనీ స్ట్రీట్ నెంబర్ 8, మాధవ నగర్, పాంగ్రా, డి8 సెక్షన్ పరిధిలో రేణుక నగర్, సాయి నగర్ రోడ్ నెంబర్ 4, ఇందిరాపూర్ కాలని, శ్రీరామ్ నగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

హైమాస్ట్ లైట్లను ప్రారంభంచిన జడ్పీ చైర్మన్


హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న జడ్పీచైర్మన్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని రాంపూర్, వెంకటాపూర్ గ్రామాలలో 15 వ ఆర్థిక సంఘం జెడ్పి నిధులతో ఏర్పాటుచేసిన హై మాస్ట్ లైట్లను జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు బుధవారం రాత్రి ప్రారంభించారు. అనంతరం మహిళాదినోత్సవం సందర్భంగా ఇరు గ్రామాలకు చెందిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఇరు గ్రామాల నాయకులు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

13న ర్యాలీ, సభను జయప్రదం చేయండి

- బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సూర్య శివాజీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ తొమ్మిదవ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఈనెల 13, 14 తేదీల్లో నిజామాబాద్‌లో జరిగే ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సూర్య శివాజీ అన్నారు. ఈసందర్భంగా గురువారం మండల కేంద్రంలో ప్రచారం చేసి మాట్లాడారు. మోడీ ప్రభుత్వం జీఎస్టీ, కోట్పాచట్టాల పేరుతో బీడీ పరిశ్రమను దెబ్బతీస్తూ సిగరెట్ కంపెనీలకు, ఇతర మత్తు పదార్థాలు, పానీయాలకు ప్రోత్సహిస్తుందని అన్నారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మండలంలోని పలు గ్రామాల్లో బీడీ కార్మికులతో సమావేశాలు నిర్వహించి ప్రచారం చేశామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పోశెట్టి, సుప్రియ, ధనలక్ష్మి గంగక్క, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ


కల్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను మండల ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పంపిణీ చేశారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ నర్సారెడ్డి, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, తహసీల్దార్ విక్రమ్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ, కో అప్షన్ సభ్యులు మునిరోద్దీన్, నల్లూర్ ఎంపీటీసీ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో పనులు ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ఘన్‌పూర్ శ్మశాన వాటికలో ట్రాక్టర్‌తో చదును పనులు చేపట్టారు. శ్మశాన వాటికలో వసతులు కల్పించడంలో గ్రామపంచాయతీ పాలకవర్గం,కార్యదర్శి విఫలం చెందారని సోమవారం మండల కేంద్రంలోని ఘన్ పూర్ యువకులు ఆరోపించారు. దీంతో గురువారం శ్మశానవటికలో పనులు చేపట్టినట్టు యువకులు తెలిపారు.

విద్యార్థులకు రాగిజావా పంపిణీ

నవతెలంగాణ-సిరికొండ

వేసవికాలం ప్రారంభం కావడంతో మండలంలోని తాళ్లరామడుగు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాహార్తి తీర్చడంకోసం గురువారం రాగిజావా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నారెడ్డి, విద్యాకమిటి చెర్మెన్ సుమలత, ప్రధానోపాధ్యాయులు రాములు, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.

మోసగాళ్లకు, దొంగలకు సపోర్ట్ చేయొద్దు

- అభివృద్ధి కంటికి కనపడటం లేదా?
- నయా పైసా ఇవ్వకుండా మాట్లాడటం హేయం
- ప్రభుత్వాలను కూలగొట్టడమే బీజేపీ ఎజెండా, సిద్ధాంతం
- ఆర్టీసీ చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎన్నికలు, ఇతర సమయంలో గ్రామాలకు వచ్చే మోసగాళ్లు, దొంగలకు ఎట్టి పరిస్థితిలో మద్దతు ఇవ్వొద్దని, అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. గురువారం ఇందల్ వాయి మండలంలోని లోలం గ్రామంలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా పరిషత్ ఆర్థిక ప్రణాళిక సంఘం సభ్యులు, ధర్పల్లి జడ్పీటిసి బాజిరెడ్డి జగన్ మోహన్, ప్రజా ప్రతినిధులతో కలిసి అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ఒక్క రూపాయి ఇవ్వకుండా, ఎలాంటి పనులు చేయకుండా గ్రామాలకు వచ్చే వారిని నిలదీయాలని అన్నారు.

ఒక్క గ్రామంలో కోట్ల రూపాయలు మంజూరు చేసి ప్రారంభోత్సవాలు చేసినా కనపడడం లేదా అని ప్రశ్నించారు. ఎంపిగా నయా పైసా ఇవ్వకుండ కేసీఆర్, కేటీఆర్ ,కవిత లపై అవాకలు చవాకులు పేలుతు మాట్లాడటం హేయమని అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలో కాంగ్రెస్‌తో కలిసి ఇతర పార్టీలు పాలన సాగిస్తుంటే ఆ ప్రభుత్వాలను కూలగొట్టడమే బీజేపీ ఎజెండా, సిద్ధాంతమని అన్నారు. గ్రామంలో రైతు వేదిక, కమ్యూనిటీ భవనాలు, శ్మశానవాటిక, గ్రామ పంచాయతీ భవనం సీసీ రోడ్, డ్రైనేజ్, కుల సంఘ భవనాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. గ్యాస్ దరలు పేంచుతు సామాన్యులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారని, లిక్కర్ స్కాం లో కవిత పేరు కావాలని చేర్చి భయభ్రాంతులకు గురి చేద్దామని అనుకుంటున్నారని అన్నారు. కానీ టీఆర్ఎస్ పార్టీ వీటికి లొంగదని తెలిపారు. అనంతరం సర్పంచ్ మమత శేఖర్, ఎంపిటిసి డీకోండ సరిత సుధీర్ గ్రామంలో ఇంక కావాల్సిన పనులను వినతి పత్రాలను సమర్పించారు. విటన్నింటికి నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలు సంఘాలు, సర్పంచ్ మమత శేఖర్, ఎంపిటిసి డీకోండ సరిత సుధీర్, ఉప సర్పంచ్ జగడం లక్ష్మి జలంధర్ ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, ఉమ్మడి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు లోలం సత్యనారాయణ, జి నరేష్, పాపాయి తిరుపతి, ఎంపిటిసి బాబు రావు, సీనియర్ నాయకులు పాశం కుమార్, అరటి రఘు, సహకార సొసైటి డైరెక్టర్ కిషన్, పులి వసంత సాగర్, కచ్చకాయల అశ్విని శ్రీనివాస్, మాజీ సర్పంచ్ డాక్టర్ శ్రీనివాస్, సిహెచ్ గంగాదాస్, క్రాంతి కుమార్, తహసిల్దార్ టివి రోజ ఎంపిడిఓ రాములు నాయక్ తోపాటు సిఐ లు జగడం నరేష్, మోహన్, ఎస్సై నరేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభోత్సవం చేస్తున్న బాజిరెడ్డి

నేడు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ముఖ్యమంత్రి ఆర్థిక సహాయనిధి చెక్కులను లబ్దిదారులకు పార్టీ కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు పెంటు గంగాధర్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. 10:30 గంటలకు లబ్దిదారులు హాజరుకావాలని కోరారు. ఎంపీపీ, జడ్పీటీసీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికార పార్టీ నాయకులు కార్యక్రమంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన డిప్యూటీ సీఈఓ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జగిత్యాల జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ గా విధులు నిర్వహించిన డి. సుందర వరదరాజన్ గురువారం నిజామాబాద్ జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు ని మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందించారు.

ట్రాఫిక్ జాం



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలోని పూలాంగ్ చౌరస్తాలో రాజకీయ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీ ప్రారంభించారు. ట్రాఫిక్ సిబ్బంది వాహనాలను, వాహనాదారులను ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో 10 నిమిషాల వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. పూలంగ్ చౌరస్తా నుండి యాద్గిరి బాగ్ వరకు వాహనాలు, స్కూల్ బస్సులు నిలిపోయాయి. ట్రాఫిక్ సిబ్బంది వాహనాలను కూడా మళ్లించలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

టీయూ వైస్ ఛాన్సలర్‌ను భర్తరప్ చేసి చర్యలు తీసుకోవాలి

- భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జీవీయం విట్టల్
- తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు సుమిత్రానందన్‌కు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అవినీతి అక్రమాలకు అడ్డగా మార్చిన వైస్ ఛాన్సలర్ రవీందర్ గుప్తాను భర్తరఫ్ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు సుమిత్రానందన్‌ను గురువారం హైదరాబాద్ లో కలిసి సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని అందజేశారు. టీయూ వీసీ ప్రభుత్వ అనుమతి లేకుండా నోటిఫికేషన్ ఇవ్వకుండానే డబ్బుల కోసం పోస్టులను భర్తీ చేస్తున్నారని, పీహెచ్‌డీ అడ్మిషన్ పొందాలంటే లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ డబ్బులు ఇవ్వని వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎక్కువ డబ్బులు ఇచ్చిన వారికే ప్రనమోషన్ ఇస్తున్నారని, అభివృద్ధి పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఈసీ మీటింగ్ నిర్వహించకుండా ఏకపక్ష నిర్ణయాలు చేస్తున్నారని తెలిపారు. వీసీపై విచారణ చేపట్టి భర్తరప్ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని యూనివర్సిటీ సమస్యలను పరిష్కరించాలని విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరామ్, నాయకులు వంశీ, రవి తదితరులు పాల్గొన్నారు

నేడు మైనార్టీ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-మోపాల్

2022- 23కు గాను లబ్ధిదారుల ఎంపికకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేడు మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరూ అన్ని డాక్యుమెంట్లు తీసుకొని రావాలని ఎంపీడీవో లింగం నాయక్, కార్యాలయ సిబ్బంది ప్రదీప్ తెలిపారు.

చలివేంద్రాలు ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

నవతెలంగాణ-ఏర్గట్ల

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని బాటసారుల, గ్రామప్రజల దాహాన్ని తీర్చడం కోసం తొర్తి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. గురువారం సర్పంచ్ కుండ నవీన్, వైస్ ఎంపీపీ సల్ల లావణ్య వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుండ నవీన్ మాట్లాడుతూ....గ్రామపంచాయతీ, బస్టాండ్ వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాహెర్, పంచాయ కార్యదర్శి అనిల్, వార్డు సభ్యులు అంజాద్, కుండ చిన్న సాయన్న, కుండ శ్యామల, రజియా బేగం, కారోబార్ సల్ది రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాతంత్ర విప్లవ యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్

రవన్న 7వ వర్ధంతి సందర్భంగా నివాళ్లు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజాతంత్ర విప్లవ యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్‌అని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి (ఇన్చార్జి) వనమాల కృష్ణ అన్నారు. సుభాష్ చంద్రబోస్ 7వ వర్ధంతి సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్.ఆర్ భవన్, కోటగల్లీలో విప్లవ నివాళి అర్పించారు. ఆయన ఆశయాల సాధనే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా రాష్ట్ర నాయకులు కే.యాదగిరి, డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, రూరల్ సబ్ డివిజన్ కార్యదర్శి సీ.హెచ్ సాయగౌడ్, జిల్లా నాయకులు అల్గొట్ రవీందర్, పి.ఓ.డబ్ల్యు జిల్లా ప్రధానకార్యదర్శి కే.సంధ్యారాణి, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి కిషన్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ: నక్సల్బరి పిలుపుతో గోదావరి లోయ విప్లవోద్యమ నిర్మాతల్లో ఒకరు, సీపీఐఎంఎల్ ప్రజా పంథా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసిన కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) విప్లవ ప్రజా పంథాకు మార్గదర్శి అని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథానాయకులు, అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకృష్ణ అన్నారు. మండలంలోని గడ్కోలు గ్రామంలో రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ రమేష్, నాయకులు అనీష్, బి కిషోర్, కిరణ్, ఎం లింబయ్య, కట్ట రాములు, బి సురేష్, నిమ్మల రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణంలోని కుమార్ నారాయణా భవన్ సిపిఐ :ఎంఎల్ ప్రజా పంథా కార్యాలయంలో కామ్రేడ్ రవన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు .ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్ ప్రజా పంథా) జిల్లా నాయకులు బి దేవరామ్, సబ్ డివిజన్ కార్యదర్శి ఎం ముత్తెన్న మాట్లాడుతూ.. రవన్న విద్యార్థి దశలోనే విప్లవోద్యమ నాయకుడిగా ప్రజా పంథా దళపతిగా 50 సంవత్సరాలకు పైగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు జె శేఖర్, పి వై ఎల్ జిల్లా అధ్యక్షుడు బి కిషన్, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు యం నరేందర్, జిల్లా కార్యదర్శి యస్ దుర్గా ప్రసాద్ , ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు ఎల్ అనిల్, పీవైఎల్ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రవన్న స్మారక సభను పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో నిర్వహించారు. రవన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు, డెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి బి సూర్య శివాజీ, పీవైఎల్ జిల్లా కమిటీ అధ్యక్షులు ఎస్ రవి, అరుణోదయ జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి న నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు, అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ రైతు సంఘం ఆర్మూర్ కార్యదర్శి సారా సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజాపంథా డివిజన్ అధ్యక్షుడు, అఖిల భారత రైతు సంఘం మండల అధ్యక్షుడు ఉట్నూర్ బాలయ్య అఖిల భారత కార్మిక సంఘం మండల కార్యదర్శి అశోక్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తక్క, తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్ సిటీ: రవన్నకు నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

నిజామాబాద్‌సిటీ: కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) పోరాట స్ఫూర్తితో రైతంగా ఉద్యమాలను నిర్మిస్తామని సీపీఐ ఎంఎల్ న్యూడేమోక్రసి జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్ఆర్ భవన్‌లో నిర్వహించిన వర్ధంతిలో రవన్న చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అకుల పాపన్న మాట్లాడుతూ 40 ఏండ్లు అజ్ఞాతం లో ఉంటూ రైతంగా పోరాటాలు నిర్వహించిన గొప్ప నాయకుడని అన్నారు. ఆదివాసీ గిరిజన రైతంగా ఉద్యమాలను నడిపిన యోధుడుని తెలిపారు.

కేంద్రసర్కార్ దేశ ప్రజల్లో మత విద్వేషాలు రెచ్చ గొడుతూ, పేదల పట్ల మైనారిటీల పట్ల చిచ్చు పెడుతు పబ్బం గడుపుకొంటుందన్నారు. ఈవిధానాలను వ్యతిరేకించాలని అయన అన్నారు. బలమైన రైతంగా ఉద్యమాలను నిర్మిచాడమే కామ్రేడ్ రావన్నకు అర్పించే నిజమైన నివాళులు అని అన్నారు. కార్యక్రమం లో అఖిలభారత రైతు కూలి సంగం జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భుమయ్య, న్యూడేమోక్రాసి జిల్లా నాయకులు నీలం సాయిబాబా, నాయకులు శివకుమార్, రాజు, జిల్లా నాయకులు భాస్కర్, సునీల్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో గురువారం ఇంటి పన్నుల వసూలుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రెండు బృందాలుగా ఏర్పడి ఇంటింటికీ తిరుగుతూ ఇంటి పన్నులు వసూలు చేశారు. ఇంటి పన్నులు చెల్లించాల్సిన ఆవశ్యకతను పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సక్కారం అశోక్ మాట్లాడుతూ.. ఇంటి పన్నులు చెల్లించి ద్వారా గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సకాలంలో పన్నులు చెల్లిస్తే మౌళిక వసతుల కల్పనకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విక్రమ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మండలలోని ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు శాంతి కుమార్, రజనీకాంత్ రెడ్డి, నవీన్ గౌడ్, శ్రీకాంత్, శ్రీలత,నవీన్ శివ, నవీన్, తదితరులు పాల్గొన్నారు

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని భూంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోలార్ ప్యాక్‌వైస్ ఎనర్జీ ఆర్థిక సహాయంతో గురువారం ఫర్నీచర్‌ను వితరణ చేశారు. 20 డెస్క్ బెంచీలు, మిని లైబ్రరీ రెండు ర్యాక్‌లు, రెండు టేబుల్లు, 12 కుర్చీలు, పుస్తకాలు అందజేశారు. అలాగే పర్యావరణాన్ని రక్షించడానికి ఫలాలు అందుకోవడానికి ప్రతి విద్యార్థికి జామ, మామిడి మొక్కలను అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ గైని అనుసూయ, ఎంఈఓ యూసుఫ్, ప్రసాద్, లింగయ్య, ప్రధానోపాధ్యాయుడు వీరమల్లు, మురళి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాయల సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సభ

నవతెలంగాణ-బోధన్

కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ 7వ వర్ధంతిని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన సేవలను నాయకులు వివరించారు. ఆయన చూపిన ప్రజాపంథా బాటలో విప్లవ పోరాటాలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు నిజమైన నివాళులు అర్పించినట్టు అని బోధన్ సబ్ డివిజన్ కార్యదర్శి మల్లేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ బోధన్ పట్టణ అధ్యక్షురాలు బి.నాగమణి, సుజాత, మీరాబాయి, మాధవి, టి.రవి, టి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బోర్గంలో కామ్రేడ్ రవన్న వర్ధంతి వేడుకలు

నవతెలంగాణ-రెంజల్

నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడ్డ వ్యక్తి కామ్రేడ్ రవి అన్న అని అఖిలభారత రైతు సంఘం నాయకులు పుట్టి నడిపి నాగన్న, కార్మిక సంఘం నాయకులు పార్వతి రాజేశ్వర్లు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని బోర్గం గ్రామంలో కామ్రేడ్ రవన్న వర్ధంతిని పురస్కరించుకొని వారు మాట్లాడారు. వడ్డెన్న, మండల కార్యదర్శి నసీర్, గోపాల్, సంతోష్, సిద్ధ పోశెట్టి, గంగామణి, రాజమణి, పెంటారెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వివాహానికి ఆర్థిక చేయూత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలోని నిరుపేద కుటుంబమైనా పల్లపు శంకర్, యాదమ్మ కుమార్తె (అనిత) వివాహానికి సాటాపూర్ సర్పంచ్ వికార్ పాషా ఐదు వేల రూపాయల నగదును అందజేశారు. గ్రామంలో నిరుపేద కుటుంబాలకు ఎల్లవేళలా ఆర్థిక సాయం అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాబు, నరేష్, ఆంజనేయులు, శ్రీను గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలో గెలిచిన వారికి జ్ఞాపికలు

నవతెలంగాణ-జుక్కల్

మహిళా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మండలాల అంగన్‌వాడీ టీచర్లకు ఇటీవలే ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జుక్కల్ మండలంలోని మారుముల గ్రామం గండూర్ గ్రామ అంగన్‌వాడీ టీచర్ పద్మినిబాయి సెంటర్ 2 వారు ముగ్గుల పోటీలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో మూడవ స్థానంలో గెలుపొందారు. కాగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో మహిళ దినోత్సవం అంగన్‌వాడీ టీచర్ పద్మినిబాయికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ జ్ఞాపిక అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారిని, జుక్కల్ మండల సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఎల్లారెడ్డి అసెంబ్లీ పాత కమిటీ రద్దు

- నూతన అధ్యక్షులుగా బబ్లూ నియామకం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సారథ్యంలో నిర్వహిస్తున్న జీతేగా బహుజన్‌లో భాగంగా గురువారం నిర్వహించిన జీతేగా బహుజన్ జూమ్ మీటింగ్‌లో తెలంగాణ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఎల్లారెడ్డి అసెంబ్లీ పాత కమిటీని రద్దు చేశారు. తిరిగి నూతన అసెంబ్లీ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా బీఎస్పీ ఎల్లారెడ్డి అసెంబ్లీ అధ్యక్షులుగా అట్కారి బబ్లును నియమించారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, అలాగే జిల్లా నాయకులకు, తోటి నాయకులు, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లారెడ్డి అసెంబ్లీలో గెలుపే ధ్యేయంగా పనిచేసి నిరంతరం ప్రజా సమస్యలపై, పోరాటం చేస్తూనే కమిటీల నిర్మాణం మీద దృష్టి పెడతానని తెలిపారు.

ఆరు క్వింటాళ్ల కొనుగోలు నిబంధన తొలగించాలి

- మండల వ్యవసాయాధికారికి వినతి



వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలో శనగ కొనుగోలు కేంద్రాలలో ఎకరానికి ఆరుక్వింటాళ్ల నిబంధనను తొలగించాలని, కౌలు రైతులను ఆదుకోవాలని కోరుతూ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావుకు రైతులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. సుమారు 2000 ఎకరాలలో శనగ పంట, వెయ్యి ఎకరాలలో సన్‌ఫ్లవర్, 2500 ఎకరాలలో వరి పంట వేశారని, శనగ పంటకు బదులు వ్యవసాయ విస్తీర్ణాధికారులు పంట సర్వేలో వరి పంటను నమోదు చేశారని తెలిపారు. శనగ కొనుగోలుకు కొర్రీలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.
ఫోటో వార్త తప్పనిసరిగా వేయగలరు యాడ్ ఇచ్చారు

పెంటాఖుర్దులో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో సర్పంచ్ వీరన్న పటేల్ పలు అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే షకీల్ అమీర్ గ్రామీణ ఉపాధి హామీ నిధుల నుంచి మంజూరు చేసిన రూ.50 లక్షల నిధులతో గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణం, మైనారిటీ శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారని అన్నారు. ఆ నిధులతో పనులను ప్రారంభించినట్టు తెలిపారు. త్వరలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శివసాయి పటేల్, ఉపసర్పంచ్ షేక్ బురాన్, మాజీ సర్పంచ్ సుదర్శన్, ఏఎన్ఎం ఆస్మా, సాయిలు, రమేష్, ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-రెంజల్



మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు, ప్రథమ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని గురువారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మమ్మాయి నాగరాజ్, ప్రిన్సిపాల్ బలరాం, ఉపాధ్యాయులు ఆయేషా ఫాతిమా, అరుణ జ్యోతి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-సదాశివనగర్/కోటగిరి/రామారెడ్డి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అడ్వకేట్ లతారెడ్డి, ప్రేమల అన్నారు. గురువారం మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని వార్డ్ మెంబర్లు, వీవోఏ, ఆశావర్కర్, అంగన్వాడీ, బుక్ కీపర్స్‌కు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై వారు మాట్లాడారు. మహిళా ఆదిశక్తి అని.. ఎక్కడైతే మహిళలు గౌరవింపబడతారో అక్కడ సమాజం తలెత్తుకొని జీవిస్తుందన్నారు. ఆధునిక కాలంలో మహిళల పాత్ర కీలకమని, మహిళలేనిది ఏ రాజ్యాలు లేవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జానకి జనార్ధన్, ఉప సర్పంచ్ లక్ష్మీపతి, ఎంపీటీసీలు ఎడ్ల రేణుక, లక్ష్మి రాజలింగం, మోసార్ల శ్రీకాంత్‌రెడ్డి, సుషిలా, సావిత్రి, బాపవ్వ ఏఎన్ఎం స్వరూప, ఆశావర్కర్లు, వీవోఏలు, అంగన్వాడీలు, బుక్‌కీపర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు..

కోటగిరి : తెలంగాణ పీఆర్టీయూ ఉమ్మడి మండల శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కోటగిరి మండల విద్యావనరుల కేంద్రంలో మహిళలకు వివిధ రకాల ఆటలు నిర్వహించి మండల మహిళా ఉపాధ్యాయినీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మండల విద్యాధికారి నాగనాథ్ మాట్లాడుతూ.. స్త్రీలు అన్ని రంగాలలో రాణించాలని, అప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని, స్త్రీశక్తి చాలా బలమైనదని, భవిష్యత్తులో మహిళా సాధికారికతకు చట్టాలు అవసరమని పేర్కొన్నారు. చేతన్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఉప సర్పంచ్ సావిత్రి, అంగన్వాడీ టీచర్ దుర్నీతి బాయి, సర్పంచి గౌతమ్ వార్డ్‌మెంబర్లు సన్మానించారు. పీఆర్టీయూ కోటగిరి, పోతంగల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగరాజు, వెంకటేష్, ప్రశాంత్ కిరణ్, కృష్ణ మోహన్, జిల్లా బాధ్యులు శానం సాయిలు, రాష్ట్ర బాధ్యులు సత్యనారాయణ, మండల బాధ్యులు స్రవంతి, పాషా, గాయత్రి, మండలంలోని మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళ సిబ్బందిని సన్మానించిన గ్రామపంచాయతీ

రామారెడ్డి : మండలంలోని పోసానిపేటలో మహిళా సిబ్బందికి గురువారం గ్రామపంచాయతీ తరపున సర్పంచ్ గిరెడ్డి మహేందర్ రెడ్డి అధ్యక్షతన, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా గ్రామ ఏఎన్ఎం భువనేశ్వరి వైద్య సేవలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు, జిల్లా స్థాయిలో గుర్తించి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సన్మానించగా, గురువారం ఆమెతోపాటు, గ్రామపంచాయతీ కార్యదర్శి సంగీత, ఆశా వర్కర్లను, గ్రామపంచాయతీ సిబ్బందిని శాలువాలతో సన్మానించామని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుతారి నరేష్, పాలకవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్ : పలువురిని సన్మానిస్తున్న దృశ్యం



కోటగిరిలో..



రామారెడ్డిలో..

పనులను త్వరగా పూర్తి చేయాలి

- ఎంపీపీ

నవతెలంగాణ-భిక్కనూర్



మాట్లాడుతున్న ఎంపీపీ

మండలంలో మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ గాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద సీసీ రోడ్ల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కు కృతజ్ఞతలు తెలుపుతూ వివిధ గ్రామాలకు ఉన్న బీటీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరైనట్టు వివరించారు. జంగంపల్లి గ్రామ సర్పంచ్ నరసింహులు యాదవ్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించలేకపోతున్నామని నిధులు విడుదల చేయాలని కోరారు. దీంతో ఎంపీఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 100శాతం అన్ని గ్రామ పంచాయతీల ఇంటి పన్నులు, నీటి పన్నులు వసూలు చేయాలని, తద్వారా పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు వెసులుబాటు కలుగుతుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో తిప్పాపూర్, అంతంపల్లి, జంగంపల్లి గ్రామాలను కలపాలని ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు కోరారు. పలు గ్రామ పంచాయతీల సర్పంచులు విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మ నాగభూషణం గౌడ్, వైస్ ఎంపీపీ గుడిసె యాదగిరి, మార్కెట్ కమిటీ చైర్మన్ భగవంతు రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ లింగాల కృష్ణ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఎంపీడీవో అనంతరావు, ఎంపీటీసీలు, సర్పంచులు, సొసైటీ చైర్మన్‌లు, రోడ్లు భవనాల డీఈ శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ సోహెల్, వైద్యాధికారి యేమిమా అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు 56 మంది అభ్యర్థులు హాజరు

నవతెలంగాణ-పిట్లం



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ఎస్సీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు 56 మంది హాజరైనట్టు ఎంపీఓ బ్రహ్మం తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో 2020-21కి గాను ఎస్సీ కార్పొరేషన్‌కు ఆన్లైన్ దరఖాస్తులు చేసుకున్న ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 78 మంది ఎస్సీలు పలు రకాల వ్యాపార సబ్సిడీ రుణాల నిమిత్తం దరఖాస్తులు చేసుకున్నారని మండలానికి 80 యూనిట్లు టార్గెట్ ఉండడంతో ఇంటర్వ్యూలకు హాజరైన వారందరూ అర్హులుగా భావిస్తున్నామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ సీనియర్ అసిస్టెంట్‌లు నరేష్, శశికాంత్, కార్పొరేషన్ డీఈవోలు నరేష్, ఈక్రమ్ ఖాన్, ఎల్‌డీఎం వెంకట్, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ స్వామి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ముఖేష్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాంపూర్ (కలాన్) మేనేజర్ రమణాచారి, కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రావణ్ కుమార్ (పెద్దకొడప్‌గల్ బ్యాంకు మేనేజర్) తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు

- ఎంపీపీ అశోక్ పటేల్

నవతెలంగాణ-బిచ్కుంద

జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్ షిండే బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి సదుపాయాలు కల్పించి వైద్య సేవలు అందిస్తూ ప్రజలకు అండగా నిలిచారని ఎంపీపీ అశోక్ పటేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ప్రజా ప్రతినిధులు ఆసుపత్రి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం ఎంపీపీ అశోక్ పటేల్ మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలిసిస్ సెంటర్ ప్రారంభించి రోగులకు ఆరోగ్యంతో పాటు డబ్బు సమయం వృధా కాకుండా సదుపాయాలు కల్పించారని అన్నారు. గతంలో ప్రైవేట్ ఆస్పత్రిలో డబ్బులు ఖర్చు పెట్టి కిడ్నీ వ్యాధిగ్రస్తులు చికిత్సలు నిర్వహించుకునే వారని పేద రోగులు హైదరాబాద్ నిమ్స్, గాంధీ ఆసుపత్రితో పాటు నిజామాబాద్, బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు నిర్వహించుకోవడం వల్ల సమయంతో పాటు డబ్బు వృధా అయ్యేది అన్నారు. బిచ్కుంద ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఇబ్బందులు తప్పాయని వారికి పరిపూర్ణ సేవలు ప్రభుత్వ ఆసుపత్రిలోని అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నాగనాథ్ పటేల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు శ్రీహరి రాజు, మల్లికార్జున పటేల్, డయాలసిస్ సెంటర్ ఇంచార్జ్ మానిక్, స్వాతీ, సాయినాథ్, లక్ష్మన్, నితిన్, సంతోష్, నరేష్ ప్రజలు ఉన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-బోధన్

మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అలాగే 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అలీమ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కటి ప్రణాళికతో చదివి పదవ తరగతి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. 100శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులు సమాయత్తం కావాలన్నారు. ఉపాధ్యాయని ఉపాధ్యాయులు ప్రసాద్ గౌడ్, పరశురాం, గంగాధర్, పద్మ, శివయ్య, సీఆర్పీలు విజయ్, రేఖ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు

అదనపు క్లాస్ రూంలను మంజూరు చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌కు వినతి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అదనంగా సరిపడా తరగతి గదులను మంజూరు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కామారెడ్డి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు అరుణ్ మాట్లాడుతూ.. కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు సంఖ్య పెరిగిందని, కానీ విద్యార్థుల తరగతి గదులు మాత్రం పెరగకపోవడం వల్ల గదులు సరిపోక బయట కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కావున వెంటనే విద్యార్థులకు సరిపడా తరగతి గదుల నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెగ్యులర్ కోర్సులతోపాటు ఒకేషనల్ కోర్సులు కూడా రావడం వల్ల ఆ కళాశాల భవనం సరిపోవడం లేదని, వెంటనే మంజూరు చేసి తరగతుల నిర్మిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, వర్ధిని, నాయకులు అవినాష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

విద్యార్థులకు, అధ్యాపకులకు సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్ (కామారెడ్డి)కి చెందిన విద్యార్థులు ఇటీవల తెలంగాణ విశ్వ విద్యాలయంలో మాథమాటిక్స్ విభాగం వారు నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొని, బహుమతులు సాధించారు. కళాశాలకు చెందిన బి.మేఘన శ్రీ ప్రథమ స్థానంలో నిలిచి రూ.3వేలు ప్రైజ్‌మనీని, పి.రక్షిత తృతీయ స్థానంలో నిలిచి రూ.1000రూపాయల ప్రైజ్‌మనీ గెలుచుకున్నారు. ఇందుకోసం విద్యార్థులకు సరైన దిశా నిర్దేశం చేసిన మాథమాటిక్స్ అధ్యాపకులు కే శ్రీలత, ఎం.అన్నపూర్ణ భార్గవి బహుమతులు గెలుచుకున్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.రాధిక, వైస్ ప్రిన్సిపాల్ పి.మాణిక్య రేఖ, అధ్యాపక బృందం అభినందించారు.

పలుచోట్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి/దోమకొండ/రామారెడ్డి

మండలంలోని బిర్మల్ తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సురేందర్ ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.10లక్షల నిధులు మంజూరు చేసినట్టు సర్పంచ్ గోతిదర్బార్ తెలిపారు. సర్పంచ్ గోతి దర్బార్, ఉప సర్పంచ్ సీతారాం నాయక్, పంచాయతీ పాలక వర్గ సభ్యులు, తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని హేమ్లానాయక్ తాండలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ రాధా చందర్ నాయక్‌తో కలిసి ఎంపీపీ రాధా బలరాంనాయక్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఉపసర్పంచ్ రవి, సొసైటీ డైరెక్టర్ సంగ్య నాయక్, వార్డు సభ్యులు, సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమకొండ : మండలంలోని అంచనూరు గ్రామంలో సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ సభ్యులు తీగల తిరుమలగౌడ్, సర్పంచ్ బూరని సమత స్వామిగౌడ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచన మేరకు గ్రామంలో రూ.15లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించామని తెలిపారు. మాజీ ఎంపీటీసీ స్వామి గౌడ్, ఎంపీటీసీ సభ్యురాలు దోర్నాల లక్ష్మీ లక్ష్మణ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సొసైటీ డైరెక్టర్ రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులు

రామారెడ్డి : మండలంలోని సింగరాయిపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన రూ.15 లక్షల సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని సర్పంచ్ అధికం మహేశ్వరి నర్సాగౌడ్ గురువారం తెలిపారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

లింగంపేట్ : మండలంలోని పోల్కంపేట్ గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ పద్మా నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ వెంకటి తదితరులు పాల్గొన్నారు.



గాంధారి మండలంలో..



లింగంపేట్ : పోల్కంపేట్‌లో..

ఆటోలో గాంధీ భవన్‌కు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-జుక్కల్



ఆటోలో వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే

జుక్కల్ మాజీ ఎమ్మెలే సౌదాగర్ గంగారాం గాంధీభవన్ వరకు ఆటోలో వెళ్లారు. బుధవారం పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన తిరుగు ప్రయాణంలో జుక్కల్ నియోజక వర్గానికి చెందిన ఆటో డ్రైవర్ కనిపించడంతో ఆప్యాయంగా పలకరించాడు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తాను ఊరు వదిలి పట్టణంలో ఉపాధి కోసం వచ్చానని ఆటో డ్రైవర్ ఇమామ్ మాజీ ఎమ్మెల్యేతో తెలిపాడు. జుక్కల్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గంగారాం తన సహజశైలిలో ఉండటం.. సాధారణ వ్యక్తిలా ఆటోలో ప్రయాణించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

ఢిలీకి తరలిన మహిళ ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ధర్పల్లి



చట్ట సభల్లో మహిళ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేస్తూ బీఅర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా నేటి నుండి చేపట్టనున్న దీక్ష కు మద్దతుగా గురువారం ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు తరలివెళ్లారు. రూరల్ లోని అయామండలాల ఎంపీపీలు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లతో కలిసి హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయం నుండి ఢిల్లీకి బయలు దేరి వెళ్లారు. వారి వెంట ఇందల్వాయి ఎంపీపీ రమేష్ నాయక్, ఎంపీటీసీ డీకొండ సరిత సుధీర్, ధర్మయ్య గారి రాజేందర్ రెడ్డి. తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

4

శుక్రవారం 10 మార్చి 2023

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండలంలోని కలిగోట్ గ్రామంలో 25 లక్షల రూపాయలతో నాలుగు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎంపీపీ కుంచాల విమల రాజు, జడ్పీటీసీ తనూజ శ్రీనివాస్‌రెడ్డి గురువారం భూమి పూజ చేశారు. ఉపాధిహామీ నిధులతో గ్రామంలోని నాలుగు సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ, ఉప సర్పంచ్, టీఆర్ఎస్ నాయకులు, గ్రామవిద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా చెక్కు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద గల గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఖాతాదారుడు లింగాల బాలరాజు గౌడ్ ప్రమాదవశాత్తు మరణించగా ఆయన భార్య గంగామణికి లక్ష రూపాయల చెక్కును గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్య తరగతి, వ్యాపార, ఉద్యోగ వర్గ ప్రజలకు నామమాత్రపు చార్జీలతో ఖాతాదారుల కుటుంబాలను ఆదుకుంటున్నారని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ రామోజీ లింబాద్రి, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించిన సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఫుట్‌బాల్ క్రీడాకారులతో సీపీ నాగరాజు, తదితరులు

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని ప్రశాంతి నిలయంలో మహిళా ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్‌ను సీపీ నాగారజు గురువారం ప్రారంభించారు. ఈనెల 28నుండి పంజాబ్ రాష్ట్రంలోని అమృత్ సర్‌లో జాతీయ స్థాయి మహిళా ఫుట్ బాల్ టోర్నమెంటు నిర్వహణకోసం తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళా ఫుట్బాల్ క్రీడా కారులకు కోచింగ్ కోసం నిజామాబాద్ పోలీస్ శాఖ సౌజన్యంతో నిజామాబాద్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా పోలీస్ కమిషనర్ నాగరాజు హాజరై కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించి క్రీడాకారులకు కిట్స్ ప్రదానం చేశారు. మన రాష్ట్రం నుండి వచ్చిన క్రీడాకారులకు మన నిజామాబాద్ లో కోచింగ్ క్యాంప్ నిర్వహించడం ఎంతో సంతోషకరమైన విషయం అని అన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 23-3-2023 వరకు ఈ క్యాంప్ ఉంటుందని అన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ఉత్ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసు కురావాలని, అన్నారు. కార్యక్రమంలో అదనపు డి.సి.పి (ఎ.అర్) గిరిరాజ్, ఎ.ఆర్ ఎ.సి.పి సంతోష్ కుమార్, డాఎం కవితారెడ్డి జిల్లా ఫుట్ బాల్ వైస్ ప్రెసిడెంటు మసూద్ ఎజాజ్, ట్రెజరర్ మీర్ ఫారుఖ్ అలీ, సెక్రెటరీ జావిద్, కోచ్ నాగరాజు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

11న జైవిజ్ఞాన్ పుస్తక పరిచయసభ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రముఖ కవి, రచయిత డా.కాసర్ల నరేశ్ రావు రచించిన జై విజ్ఞాన్ బడిపిల్లల నాటికల పుస్తకం ఇటీవల హైదారాబాద్‌లో విడుదలైందనీ, ఆ పుస్తక పరిచయసభ ఈనెల 11 న , ఇందూరుయువత ఆధ్వర్యంలో జరుగనున్నదనిసంస్థ అధ్యక్షులు సాయిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు నాందేవ్ వాడలోని సంస్థ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ఈ జైవిజ్ఞాన్ పుస్తకపరిచయాన్ని ప్రముఖకవి గంట్యాల ప్రసాద్ నిర్వహించనున్నారని తెలిపారు. ఈ సభకు కవులు, సాహిత్యాభిమానులందరూ హాజరు కావాలనీ సాయిబాబు కోరారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ముస్తాబైన ఆట మైదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఆల్ ఫోర్స్ (నరేంద్ర) హైస్కూల్లో నిర్వహిస్తున్నటువంటి 37వ రాష్ట్రస్థాయి బాలుర సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ ఆటల పోటీలు ఈనెల 10నుండి ప్రారంభం అవుతున్నట్లు జిల్లా అడా కమిటీ చైర్మన్ గంగా మోహన్ చక్రు,, కన్వీనర్ సురేందర్, కో కన్వీనర్ రాజేష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా పేట వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి మాట్లాడుతూ... ఈ టోర్నమెంట్ కు ఒలంపిక్స్ అధ్యక్ష కార్యదర్శులు పూర్తిస్థాయిలో సహకరించారని తెలిపారు ఆటల పోటీలకు మైదానము , కోర్టులు సర్వం సన్నద్ధం చేశామని ఆయన తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా పది బాలుర జట్లు హాజరవుతున్నాయన్నారు. బాలుర జట్లకు ఆల్ ఫోర్స్ పాఠశాలలో వసతి ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ గంగా మోహన్ చక్రు కన్వీనర్ సురేందర్, కోకన్వీనర్ రాజేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సురేష్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, నాగేష్, శ్యామ్, చిన్నయ్య, సురేష్, రమణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు .

పెర్కిట్‌లో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని పెర్కిట్ లో గల 21వ వార్డు దేవాంగ సంఘంలో స్థానిక కౌన్సిలర్ లిక్కి శంకర్ ఆధ్వర్యంలో కంటి వెలుగు కేంద్రాన్ని గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్ ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకొని ఉచితంగా కంటి అద్దాలను పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నా భాయ్, వైద్యురాలు ఉమేరా యాస్మిన్, సూపర్ వైజర్ ఆనవాల, ఆరోగ్య కార్యకర్తలు, ఆస్తాలిక్ కార్తీక్, టీఆర్ఎస్ పట్టణ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సత్యానంద్, సుభాష్ గౌడ్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

12,13న బాల్కొండ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి పర్యటన

- కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి
- 13న కమ్మర్‌పల్లి, ఉప్లూర్‌లో హాత్ సే హాత్ జోడో పాదయాత్ర
- రెండు రోజులపాటు మండలంలోనే పీసీసీ అధ్యక్షుడు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



సమావేశంలో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

బాల్కొండ నియోజక వర్గంలో పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి హాత్ సే హాత్ జోడో పాదయాత్ర ఈ నెల 11న రాత్రి కమ్మర్‌పల్లికి వస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకేట రవి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి లతో కలిసి ఆయన మాట్లాడారు. పాదయాత్రకు 12వ తేదీన విరామం ఉన్నందున ఉదయం భీంగల్‌లోని లింబాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో దర్శనం చేసుకుని కమ్మర్‌పల్లికి చేరుకుంటారన్నారు. అనంతరం ఉదయం 11:00 గంటల నుండి రైతులతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకుంటారని తెలిపారు. సాయంత్రం కుల సంఘాల సభ్యులతో, కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశం ఉంటుందని చెప్పారు. 13నకమ్మర్‌పల్లి నుండి పాదయాత్ర ఉప్లూర్ చేరు కుంటుంద న్నారు. సాయంత్రం 4గంటలకు ఉప్లూర్ నుండి పాదయాత్ర ఏర్గట్ల వరకు కొనసాగిస్తారని తెలిపారు. అనంతరం కార్నర్ మీటింగ్ ప్రసంగిస్తారన్నారు. 13న బాల్కొండ నియోజకవర్గంలో పాదయాత్ర ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ యుఐ అధ్యక్షులు వేణు రాజ్, పిసిసి సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్, బాల్కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తిప్పరెడ్డి శ్రీనివాస్, పడిగెల ప్రవీణ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అబ్దుల్ రఫీ, బుచ్చి మల్లయ్య, రాజేంద్రప్రసాద్, దేవేందర్, ప్రదీప్, సుంకేట శ్రీనివాస్, కొమ్ముల రవీందర్, చింతకుంట శ్రీను, శైలేందర్, తిరుపతి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీలను జాగ్రత్తగా కాపాడుకోవాలి

- ఘనంగా ప్రపంచ కిడ్నీ దినోత్సవం
- డాక్టర్ మోహాసిన్ నేఫరాలజిస్ట్‌తో అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రపంచ కిడ్నీ దినోత్సవం సంధ్బంగా మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో డాక్టర్ మొహసీన్ నెఫరాలజిస్టు (కిడ్నీ వైద్య నిపుణులు) మెడికవర్ ఆసుపత్రి ప్రాంగణంలో పేషెంట్లకు, వారి బంధువులు, ప్రజలకు కిడ్నీ పనితీరు -జాగ్రత్తలపై అవగాహనా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మొహసీన్ మాట్లాడుతూ.. ప్రతి పది మందిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. అధిక రక్త పోటు, డయాబెటిస్, స్థూలకాయం కిడ్నీ వ్యాధి కూడా కారణం కావచ్చని తెలిపారు. కిడ్నీల సమస్య ఉన్నప్పుడు దాహం, అలసట, బలహీనత, ఉబ్బిన చేతులు, ముఖం, పాదాలు, ఉదరం, చీలమండలు, తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. అధిక రక్తపోటు మూత్రపిండాల చిన్న ధమనులను (గ్లోమెరులి) దెబ్బతీస్తుందన్నారు. మధుమేహం మూత్రపిండాల వైఫల్యానికి ప్రధాన కారణమని తెలిపారు. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి ఉన్నట్లయితే రక్తపోటు 130 కంటే తక్కువగా ఉండాలని, అల్బుమినూరియా, లేదా మూత్రంలో అల్బుమిన్ ఉండటం మూత్రపిండ వ్యాధికి సంకేతమని అన్నారు. కిడ్నీ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, బరువును నియంత్రించుకోవాలని, సమతుల్య ఆహారంతీసుకుంటూ ధూమపానం వదిలేయాలని తెలిపారు. జీవనశైలిలో మార్పులు, చికిత్స ద్వారా వ్యాధిని నియంత్రిచవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దత్తురాజ్, డాక్టర్ సందీప్, డాక్టర్ యజ్ఞ ఆసుపత్రి మేనేజ్మెంట్ స్వామి శ్రీనివాస్ శర్మ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీని నమ్ముకున్న వారికి గుర్తింపు

- తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/జక్రాన్‌పల్లి/సిరికొండ



నిజామాబాద్‌సిటీ: అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన తారిక్



సిరికొండ:తారిక్ అన్సారిని సన్మానించిన నాయకులు

పార్టీని నమ్ముకుని పనిచేసిన ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం తప్పకుండా లభిస్తుందని రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ అన్నారు. గురువారం రాష్ట్ర మైనారిటీ యిమిషన్ చైర్మన్‌గా నియామకమై జిల్లాకు వచ్చిన సందర్భంగా స్వాగత ర్యాలీ నిర్వహించారు. నగరంలోని పూలాంగ్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మైనారిటీ కమిషన్ చైర్మన్‌ను నగర మేయర్ నీతూకిరణ్, నుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తారీక్ అన్సారిని పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తారీక్ అన్సారి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యత అప్పగించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మంత్రి, ఎమ్మెల్యేలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బబ్బు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన తారీక్ అన్సారిని తెలంగాణ రాష్ట్ర కోఆప్షన్ మెంబర్ల ఉపాధ్యక్షుడు బుల్లెట్ అక్బర్ ఖాన్ గురువారం సన్మానించారు. నిజామాబాద్‌లోని నెహ్రూ పార్కువద్ద మండల మైనార్టీ నాయకులు, తదితరులు తారిక్ అన్సారిని కలిసి పూలమాల, శాలువలతో సన్మానించారు.

సిరికొండ: తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ కమిషన్ చైర్మన్ గా నియమితులైన తారిఖ్ అన్సారీ ని గురువారం మండల బీఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు గౌస్ బాషాసభ్యులు ఇందల్ వాయి టోల్ గేట్ వద్ద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముషీర్, సాజిద్, వహీద్, శుభన్, షేక్ వహీద్, మోసీన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బిల్డింగ్‌కి అనుమతి లేకుండా నడిపిస్తున్న శ్రీ చైతన్య ప్రైమరీ పాఠశాలను గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం నరేందర్, ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాలను బేకాతరు చేస్తున్న శ్రీ చైతన్య పై చర్యలు తీసుకోవాలని అన్నారు. మరోవైపు 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సమయపాలన పాటించకుండా ఒత్తిడికి గురి చేస్తున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. ప్రైమరీ సెక్షన్‌కు గుర్తింపు లేకున్నా గ్రౌండ్ ఫెసిలిటీ లేకుండా నడిపిస్తున్నారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి శ్రీ చైతన్య పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ దుర్గాప్రసాద్, ఏరియా నాయకులు సాహెబ్ రావు, నవీన్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై శ్రీకాంత్ వివరాల ఉప్రకారం.. మండలంలోని పుప్పాలపల్లి గ్రామానికి చెందిన ఉల్లెంగ రమేష్ (41)కు గత నెల 23న భార్యతో గొడవ జరిగింది. ఆవేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాదడు. ఆయన్ను వెంటనే నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల డిశ్చార్జి చేశారు. పురుగుల మందు ప్రభావంతో అస్వస్థతకు గురికాగా ఈనెల 8న మళ్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని భార్య ఉల్లేంగ సత్య గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కంటి వెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలి

- సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



కంటి పరీక్ష చేయించుకుంటున్న సర్పంచ్

కంటి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఉప్లూర్ గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కంటి పరీక్షల శిబిరాన్ని సర్పంచ్ పద్మ చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో దూర దృష్టితో తెలంగాణ రాష్ట్రంలో కంటి సమస్యలతో ఎవరు ఇబ్బంది పడకూడదు అన్న ఉద్దేశంతో ఎంతోకంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. నెల రోజులపాటు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్పంచ్ బద్దం పద్మా చిన్నారెడ్డి కంటి పరీక్షలు చేయించుకుని శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిప్పెర అనిల్, కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు లుక్కా గంగాధర్, మండల వైద్యాధికారి డాక్టర్ నరసింహస్వామి, కంటి వైద్యులు శివకుమార్, డీఈవో అభినవ్, సూపర్వైజర్ ఎస్తేర్, ఏఎన్ఎం అరుణకుమారి, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ పాయిజన్లు జరిగినా హాస్టల్స్‌ను సందర్శించరా?

- ఎస్ఎఫ్ఐ టీయూ కార్యదర్శి శ్రీశైలం
- హెల్త్‌కేర్‌లో కనీసం టాబ్లెట్లు లేని దుస్థితి
- అధికారులు చోద్యం చూడడం దారుణం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న నాయకులు

ఫుడ్ ఫాయిజన్లు జరిగినా యూనివర్సిటీ అధికారులు హాస్టళ్లను సందర్శించరా డానికి సమయం లేదా? యూనివర్సిటీలో హెల్త్ కేర్ లో కనీసం టాబ్లెట్లులేని దుస్థితి నెలకొని ఉన్న అధికారులు చోద్యం చూడడం దారుణమని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కార్యదర్శి కోమిర శ్రీశైలం అన్నారు.భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ) తెలంగాణ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ముందు మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని, అధికారులు హాస్టల్ లను సందర్శించాలని అనేక సార్లు వినతి పత్రాలు అందించిన పాలన యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. హాస్టల్ లో నాణ్యత గల భోజనాన్ని అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి వారం అన్ని హాస్టల్స్ లో హెల్త్ చెక్ అప్ లు జరపాలని, హెల్త్ కేర్ నీ 24/7గంటలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. యూనివర్సిటీ రాహదరి గుంతలతో అధ్వానంగా తయారైందని, మరమత్తులు చేయాలని పేర్కొన్నారు. ప్రతి వారం హెల్త్ క్యాంప్స్ నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు ప్రసాద్,యూనివర్సిటీ ఉపాధ్యక్షులు వెంకటేశ్, శ్రీకాంత్, సహాయ కార్యదర్శులు ఆదిత్య, చరణ్, చీత్రు తదితరుల పాల్గొన్నారు.

మనబస్తి -మనబడి మౌలిక వసతుల పనులు ప్రారంభం



పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని గూపన్‌పల్లి డివిజన్-3లో రూ. 16 లక్షల 85వేల రూపాయలు నిధులతో నిర్మించిన మనబస్తి - మనబడి మౌలిక వసతుల కల్పన పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్పొరేషన్ చైర్మన్ నిజామాబాద్ గ్రామీణ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలనే ముఖ్యమంత్రి ఆలోచన మేరకు మన బస్తీ మన బడి కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.ప్రభుత్వ పాఠశాలల్లో సరైన సౌకర్యాలు, వసతులు లేని కారణంగానే అనేకమంది విద్యార్థులను ు వేలాది రూపాయల ఫీజులు చెల్లించి ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమం క్రింద రాష్ట్రంలో 26,065 పాఠశాలలు ఉండగా, మొదటి విడతలో 9,123 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందుకు గాను 7,289 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఈ నిధులతో ప్రహరీగోడ నిర్మాణం, టాయిలెట్స్ నిర్మాణం, అభివృద్ధి పనులు, విద్యుత్, త్రాగునీటి సౌకర్యం, ఫర్నిచర్ కొనుగోలు తదితర 12 రకాల అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అన్నం సాయిలు, డీఈవో దుర్గాప్రసాద్, కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి , ఎంఈఓ రామారావు, స్కూల్ హెచ్ఎం రమా, తహసీల్దార్ అనిల్, ఎస్ఎంసి చైర్మన్ సోనీ , కార్పొరేటర్ అనిల్ , టీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మీసాల మధుకర్ రావు , పాల్ద సొసైటీ చైర్మన్ జితేందర్, మన ఊరు మనబడి ఇంచార్జ్ గంగారం, ఉపాధ్యాయులు, ఏఎన్ఎలు ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

పిప్రిలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్



విగ్రహావిష్కరణలో పాల్గొన్న వియన్‌రెడ్డి, నాయకులు

బీజేపీ నియోజకవర్గ నాయకులు ప్రొద్దుటూరి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి మండలం లోని పిప్రి గ్రామంలో శివాజీ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ యోగేశ్వరనంద స్వామి నందిపేట్ పలుగుట్ట మంగి రాములు మహరాజ్ , అమ్దాపూర్ అగ్గుస్వామి మహారాజ్ , శ్రీ పరమేశ్వరి మాతాజీ పాల్గొన్నారు. విగ్రహదాత ప్రొద్దుటూరి వినయ్ రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు బాల్యం నుండే శివాజీ మహరాజ్ ఆశయాలను బోధించాలని అన్నారు. దీంతో చెడు వ్యసనాలకు బానిసలుగా మారకుండా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పిప్రి సర్పంచ్ ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసి సామర సురేష్, ఎంపీటీసీ ఎర్రవ్వ వీడిసి చైర్మన్ నన్నేం మల్లయ్య, బీజేపీ మండల అధ్యక్షులు తొర్తి రోహిత్ రెడ్డి , ఆర్మూర్ బిజెపి పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్ , మాక్లూర్ మండల అధ్యక్షులు కాలగడ్డ వినోద్ కుమార్, గోవింద్ పేట్ ఎంపిటిసి రాజ్ కుమార్ , ఎంపిటిసి శ్రీనివాస్ పట్టణ కౌన్సిలర్ బ్యావత్ సాయికుమార్ బిజెపి దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కొంతం మురళీధర్, ఈరవత్రి గంగాచరణ్ , పట్టణ దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి బ్యావత్ ప్రవీణ్, శివాజీ యువసేన సభ్యులు, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.